

నేడే రైతు రుణమాఫీ

రైతు వేదికల్లో సంబురాలకు సన్నద్ధం



ఖమ్మం, జూలై 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతు రుణమాఫీ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం శ్రీకారం చుట్టబోతుంది. ఇప్పటికే అర్హులైన రైతుల జాబితాను ప్రభుత్వం జిల్లాలు, మండలాల వారీగా విడుదల చేసింది. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో రైతు రుణమాఫీ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. తొలివిడతగా లక్ష రూపాయల లోపు రుణమాఫీని జమచేయనున్నారు. లక్ష రూపాయల వరకు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే జమకానుంది. మిగిలిన లక్ష కూడా ఆగస్టు 15లోగా జమచేసి రూ.2లక్షల రుణమాఫీ కార్యక్రమం పూర్తిచేయనున్నారు.

రైతు రుణమాఫీ సందర్భంగా గురువారం అన్ని రైతు వేదికల్లో సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిం.ది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సంబరాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీడియోకాన్ఫరెన్సు ద్వారా హైదరాబాదు నుంచి ముఖ్యమంత్రి, మంత్రులు, రైతులతో కూడా మాట్లాడే అవకాశం ఉంది. జిల్లాలో రైతు వేదికలకు భారీగా రైతులను ఆహ్వానిస్తున్నారు. రేషన్‌కార్డు నిబంధన కూడా ప్రభుత్వం సడలించినట్టు తెలిసింది. కుటుంబానికి ఒకరి చొప్పున రుణమాఫీలో అర్హత కల్పించారు. రేషన్‌కార్డు లేకపోయినా వేరే కుటుంబమై ఉంటే సంబంధిత రైతుకు కూడా రుణమాఫీ అమలు చేయబోతున్నారు. బ్యాంకు అధికారులు కూడా ఈ సొమ్ము ఇతర ఖాతాల్లో జమచేయవద్దని కేవలం రైతు రుణమాఫీకి జమచేయాలని ఆదేశించారు.

నేడు జడ్పీ స్థాయి సంఘాల సమావేశం

ఖమ్మం కలెక్టరేట్, జూలై 17: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలను గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు జడ్పీ సీఈవో ఎస్.వినోద్ ఓ ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ లింగాల కమల్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని తెలిపారు. 2 స్థాయి సంఘం, 4వ స్థాయి సంఘం విద్య వైద్యం, 1వ స్థాయి సంఘం ఆర్థిక, ప్రణాళిక, 7వ సంఘం పనులు, 3వ స్థాయి సంఘం వ్యవసాయం, 5వ స్థాయి సంఘం మహిళా సంక్షేమం, 6వ స్థాయి సంఘం సాంఘీక సంక్షేమం సమావేశాలు సాయంత్రం వరకు కొనసాగుతాయని తెలిపారు. దీనికోసం ఇప్పటికే స్థాయిసంఘాల కమిటీల సభ్యులకు లేఖలు అందించినట్టు తెలిపారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు సమీక్షలకు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు ఇద్దరు ఎంపీల పర్యటన

ఖమ్మం కలెక్టరేట్‌లో విస్తృతస్థాయి సమీక్ష సమావేశం





ఖమ్మం, జూలై 17 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాజ్యసభ సభ్యురాలు, కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి గురువారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు హైదరాబాదులో బయలుదేరి 11గంటలకు ఖమ్మానికి చేరుకొని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1గంటకు కలెక్టరేట్‌లో విస్తృతస్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. 4 గంటలకు తిరిగి హైదరాబాదు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ఇద్దరు ఎంపీలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతోపాటు కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు రావాల్సిన పథకాలు, నిధులు, కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న పనులు గురించి చర్చించనున్నారు. జిల్లా అధికారులతో నివేదికలు కూడా తీసుకోనున్నారు.

తాలిపేరుకు వరద జోరు

- ఆటోమెటిక్‌గా 25 గేట్లను ఎత్తిన సెన్సర్స్
- దిగువకు 68 వేల క్యూసెక్కుల నీరు



తాలిపేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసిన దృశ్యం

చర్ల, జూలై 17: భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టులోకి వరద నీరు పోటెత్తింది. భారీగా నీరు చేరడంతో బుధవారం ప్రాజెక్టు 25 గేట్లను ఎత్తి 68వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గత నాలుగు రోజులుగా చర్ల మండలంతోపాటు సరిహద్దునున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. చింతవాగు, రోటింత వాగు, జెర్రిపోతుల వాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్న అధికారులు... ప్రాజెక్టు సెన్సర్స్ ద్వారా బుధవారం 25గేట్లను ఎత్తి 68వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 73.90 మీటర్లు కాగా, ఇన్ ఫ్లో 69,845 క్యూసెక్కులుగా ఉంది. గురువారం కూడా ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరే అవకాశం ఉంది.

గేట్లను ఎత్తిన సెన్సర్స్

తాలిపేరు ప్రాజెక్టుకు అధికారులు రూ.కోటి 50 లక్షలతో సెన్సర్స్ ఏర్పాటు చేశారు. ఈ సెన్సర్స్.. బుధవారం ప్రాజెక్టులోకి వస్తున్న వరదనీటిని అంచనా వేసి ఆటోమెటిక్‌గా గేట్లను ఎత్తాయి. ప్రాజెక్టుపైన 25 గేట్లకు 25 బుల్లెట్ కెమెరాలు, వాటర్ లెవల్ రికార్డర్స్, టీఎఫ్‌డీ, డీ కోడర్స్ అధికారులు ఏర్పాటు చేశారు. ఇక నుంచి ఈ పరికరాలు ప్రాజెక్టు గేట్లను ఎత్తనున్నాయి. సెన్సర్స్ వినియోగం మూలంగా మ్యాన్ పవర్ కూడా తగ్గనుంది.

నీటిని సద్వినియోగం చేసుకోండి

తాలిపేరు ప్రాజెక్టు నీటిని కుడి, ఎడమ కాల్వల రైతులు వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు సూచించారు. బుధవారం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు ఆయన నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ వెంకటేశ్వరరెడ్డి, ఈఈ రాంప్రసాద్, డీఈ తిరుపతి, ఏఈ శ్రీనివాస్, రైతులు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా చర్ల మండలంలోని 18మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే వెంకట్‌రావు అందజేశారు.

భద్రాద్రి వద్ద గోదావరి పరవళ్లు

నేడు 25 అడుగులు దాటే అవకాశం.. అధికారుల అప్రమత్తం



భద్రాచలం వద్ద స్నానఘట్టాలను తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి

భద్రాచలం/పాల్వంచ రూరల్, జూలై 17: ఎగువ బాగాన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది. గంటకు సుమారు అర అడుగు చొప్పున నీటిమట్టం పెరుగుతోంది. గురువారం నాటికి భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 25 నుంచి 30 అడుగుల మధ్యకు చేరే అవకాశం ఉన్నట్టు కేంద్ర జల సంఘం అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లో తొలిసారిగా భద్రాచలం వద్ద గోదావరి 25 అడుగులను దాటనుంది. గోదావరికి ఎగువన ఉన్న సమ్మక్క బ్యారేజీ, తాలిపేరు ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయడంతో ఈ పెరుగుదల చోటుచేసుకుంటున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. మంగళవారం సాయంత్రం 6 గంటలకు 13.4 అడుగులు ఉన్న గోదావరి నీటి మట్టం అర్ధరాత్రి ఒంటిగంట వరకు నిలకడగా ఉంది. బుధవారం తెల్లవారుఝామున రెండు గంటలకు 13.6 అడుగులకు చేరుకోగా ఉదయం 6 గంటలకు 14.3 అడుగులు, 9 గంటలకు 15.1అడుగులు, 12గంటలకు 16.2, మధ్యాహ్నం 3గంటలకు 17.2, సాయంత్రం 6 గంటలకు 18.6 అడుగులకు చేరుకుంది. దీంతో గోదావరి స్నాన ఘట్టాల పైకి వరదనీరు చేరుకుంది.

కిన్నెరసానికి పెరిగిన వరద నీరు

పాల్వంచలోని కిన్నెరసాని జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి నీరు చేరడంతో బుధవారం జలాశయం నీటిమట్టం 402.80 అడుగులకు చేరింది. పాకాల, మహబూబాబాద్, ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం తదితర ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పెరగడంతో ఇన్ ఫ్లో 2200 చొప్పున చేరుకుంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా రాత్రి సమయంలో గేట్లు ఎత్తే అవకాశం ఉందని ప్రాజెక్టు ఎస్ఈ రామకృష్ణ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు.

రైతులు నష్టపోకుండా చూడాలి..

- తక్కువ భూసేకరణ చేసేలా డిజైన్ రూపొందించండి
- గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్‌లపై సమీక్ష



హైవే అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జూలై 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'రైతులు నష్టపోకుండా తక్కువ భూసేకరణ ఉండే డిజైన్ పరిశీలించండి... దానినే ఆమోదించాలి' అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే అధికారులతో బుధవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే ధంసలాపురం వద్ద ఖమ్మం నుంచి దేవరపల్లి ఎంట్రీ, ఎగ్జిట్‌లపై హైవే అధికారులు దుర్గాప్రసాద్, ఇతర అధికారులతో డిజైన్లపై మంత్రి సమీక్షించారు. భూసేకరణ తక్కువగా చేసి రైతులకు నష్టం కలగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మంత్రి తుమ్మలకు రెండు డిజైన్లపై వివరించారు. ధంసలాపురం హైవే ఎంట్రీ, ఎగ్జిట్ డిజైన్స్ త్వరగా ఆమోదింపచేసి ఖమ్మం దేవరపల్లి హైవే మిగిలిన పనులు పూర్తయ్యేలోపు ధంసలాపురం బ్రిడ్జి ఎంట్రీ ఎగ్జిట్ పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను మంత్రి ఆదేశించారు. ముదిగొండ నుంచి వెంకటగిరి మధ్య బ్లాక్ స్పాట్స్ ఉన్నందున నాలుగు లైన్ల రహదారిగా విస్తరించి స్టేట్ హైవేకు అప్పగించాల్సిందిగా రీజనల్ ఆఫీసర్ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్‌కు చెందిన రజాక్‌కు మంత్రి తుమ్మల లేఖ రాశారు.



నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

- ఆగస్టు 5 వరకు నిర్వహణ
- ఖమ్మం జిల్లాలో 6, కొత్తగూడెంలో ఒక కేంద్రం ఏర్పాటు
- ప్రతిరోజూ రెండు విడతల్లో పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖ అధికారులు
- పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలు

4



సత్తుపల్లి ట్రంక్‌పై దృష్టి

- యాతాలకుంట టన్నెల్ పూర్తయితే సత్తుపల్లికి గోదావరి జలాలు
- 550 మీటర్లు పూర్తయిన టన్నెల్
- నిధుల మంజూరుకు ప్రయత్నిస్తున్న మంత్రి తుమ్మల
- 'సీతారామ'తో సత్తుపల్లి ప్రాంతం సస్యశ్యామలం

5



ఖమ్మం నగరంలోని ఖిల్లా సమీపంలో పీరీల ఊరేగింపు దృశ్యం

భక్తి శ్రద్ధలతో మొహర్రం

ఖమ్మం నగరంలో బుధవారం పీరీలు సందడి చేశాయి. త్యాగానికి ప్రతీక అయిన మొహర్రంను నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.. ముస్లింలే కాక హిందువులు సైతం పెద్దఎత్తున ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు. శుక్రవారపేట, రిక్కాబజార్, మోమినాన్, రాతి దర్వాజ, చెరువు బజార్, తదితర ప్రాంతాల్లోని పీర్ల కొట్టాలలో నిలిపిన పీర్లను ఆచారం మేరకు నిమజ్జనం చేశారు.

4

వడివడిగా 'సీతారామ'

- పూసుగూడెం, కమలాపురం మోటార్ల పరిశీలనకు 22న చైనా ఇంజనీర్ల బృందం రాక
- అన్నీ కుదిరితే ఆగస్టు 15న వైరా రిజర్వాయర్‌కు నీటి విడుదల

ఖమ్మం, జూలై 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ఈ సీజన్‌లోనే గోదావరి జలాలను ఏన్కూరు లింక్‌కెనాల్‌తో వైరా రిజర్వాయర్‌కు తరలించి సాగర్ ఆయకట్టు అందించేందుకు ప్రభుత్వం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా సీతారామ రెండు, మూడు దశల లిఫ్టు మోటర్లను ట్రయల్‌రన్ నిర్వహించేందుకు చైనా నుంచి షాంగై కంపెనీ నిపుణుల బృందం రాబోతోంది. 22వ తేదీన వచ్చే ఈ నిపుణుల బృందం ముందుగా పూసుగూడెం, కమలాపురం లిఫ్టు మోటర్ల ట్రయల్‌రన్ నిర్వహించి ఆ తర్వాత ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వదలనున్నారు.

ఇప్పటికే ఫేజ్-1లో అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద ఉన్న పంపుహౌస్‌ను గత నెలలోనే ట్రయల్‌రన్ నిర్వహించారు ఈ ట్రయల్‌రన్ విజయవంతం కావడంతో గోదావరి జలాలు కెనాల్ ద్వారా పూసుగూడెం పంపుహౌజ్ వరకు వచ్చే సౌలభ్యం ఏర్పడింది. పూసుగూడెం నుంచి కమలాపురం పంపు హౌజ్‌కు అక్కడి నుంచి ఏన్కూరు మండలంలో రూ.70కోట్లతో నిర్మిస్తున్న 8 కి.మీ పొడవైన లింక్ కెనాల్‌లోకి గోదావరి జలాలను పంపడం ద్వారా సాగర్‌కాలువ నుంచి వైరా రిజర్వాయర్‌కు అందనున్నాయి.

ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ.8,009 కోట్ల వరకు ఖర్చుచేసింది. కాలువ పనులతో పాటు టన్నెల్ పూర్తి కావాలంటే మరో ఏడాదిన్నర సమయం పట్టే అవకాశం ఉంది. పాలేరు లింక్‌కెనాల్ పనులు పూర్తి చేయడంతో పాటు జూలూరుపాడు, సత్తుపల్లి, బీరోలు టన్నెల్స్ కూడా

(మిగతా 4వ పేజీలో)

రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులు

సకాలంలో పూర్తి చేయాలి

కొత్తగూడెంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎమ్ భర్తేష్ కుమార్‌జైన్



కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో నిర్మాణాలను పరిశీలిస్తూ సూచనలు చేస్తున్న డీఆర్ఎమ్ భర్తేష్ కుమార్‌జైన్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/భద్రాచలం, జూలై 17: రైల్వేస్టేషన్లను ఆధునికీకరణ చేసి.. ప్రయాణికులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలను అందిస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ జోన్ డీఆర్ఎమ్ భర్తేష్ కుమార్‌జైన్ అన్నారు. బుధవారం డోర్నకల్ జంక్షన్ పరిధిలోని కొత్తగూడెం రైల్వేస్టేషన్ (భద్రాచలం రోడ్)లో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను ఆకస్మికంగా పరిశీలించారు. ముఖ్యంగా ఏసీ వెయిటింగ్ హాల్, ఏసీ డార్మెంటరీ, ఏసీ రిటైరింగ్ రూమ్, కేఫ్‌టేరియా(ఫుడ్‌ప్లాజా) నిర్మాణాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. అనంతరం ట్రాక్ ఇన్‌స్పెక్షన్ చేసి సత్తుపల్లి ప్రాంతంలోని పార్థసారథిపురం వద్దగల కోల్ లోడింగ్ పాయింట్ పరిశీలించారు. అనంతరం సికింద్రాబాద్‌కు బయలు దేరి వెళ్లారు. తొలుత ప్రత్యేక సెలూన్‌లో భద్రాచలం రోడ్డుకు చేరుకున్న డీఆర్ఎం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, వేద పండితులు చిట్టి హనుమత్ శాస్త్రి, అర్చకులు అమరవాది వెంకట్రామన్, రైల్వే అధికారులు పాల్గొన్నారు. డీఆర్ఎమ్ వెంట సీనియర్ డీవోఎమ్ సురేష్‌రెడ్డి, సీనియర్ డీసీఎం బాలాజీ కిరణ్, సీనియర్ డీఈఎన్ సౌత్ దినకరన్ సీనియర్ డీఎస్‌టీఈ ప్రియాఅగర్వాల్, కొత్తగూడెం ఏరియా ఆఫీసర్ రామ్‌బజన్ మీనాజ్ ఇన్‌స్పెక్టర్ కెవై. పాషా, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌పాల్, జీఆర్పీ ఎస్ఐ సాయి, అధికారులు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.



నాయుడుకు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు శుభాకాంక్షలు

వైరా జూలై 17: రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాయుడు సత్యనారాయణను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సహా పలువురు అభినందించారు. వైరాకు చెందిన నాయుడు బుధవారం హైదరాబాదులో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడితోపాటు వైరా మునిసపల్ చైర్మన్ సూతకాని జైపాల్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బొర్రా ఉమాదేవి, నంబూరి కనకదుర్గ, వైరా మాజీ సర్పంచ్ బొర్రా పద్మావతి, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, దాసరి దానియేలు, పమ్మి అశోక్, వడ్డే నారాయణ, స్వర్ణనరేందర్, బోళ్ళగంగారావు, పుల్లపుకొండలు, రాంపూడి రోశయ్య, కన్నెగంటి నగేష్, పోలూరి సైదులు, కొప్పురావూరి శబరినాథ్ బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీ ట్రాక్టర్లకు జప్తు గండం

కిస్తీలు చెల్లించలేని స్థితిలో గ్రామపంచాయతీలు

తల్లాడ, జూలై 17: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావల్సిన నిధులు విడుదల కాకపోవడంతో గ్రామ పంచాయతీలు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాయి. గ్రామాలలో పరిశుభ్రత, పచ్చదనం కోసం బ్యాంకుల్లో రుణం తీసుకొని కొనుగోలు చేసిన ట్రాక్టర్లకు నెలవారీ కిస్తీలు(ఈఎంఐ) కూడా చెల్లించలేని స్థితిలో గ్రామపంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామపంచాయతీల్లో నిధుల కొరత వల్ల ట్రాక్టర్లకు చెల్లించాల్సిన బ్యాంకు నెలవారీ కిస్తీలు మూడునెలలుగా నిలిచిపోయాయి. దీంతో ట్రాక్టర్లకు జప్తు గండం పొంచి ఉంది.

పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీ పరిధిలోని ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించటం, హరితహారం, వన మహోత్సవం మొక్కలకు నీటి సరఫరా కోసం 2019వ సంవత్సరంలో ప్రతి గ్రామపంచాయతీ నుంచి ట్రాక్టర్, ట్రక్కు, ట్యాంకర్ కొనుగోలు చేయటం జరిగింది. ఒక్కొక్క ట్రాక్టర్ కొనుగోలుకు రూ.5,31,500, ట్రక్కుకు రూ.1.80లక్షలు, ట్యాంకర్‌కు రూ.1.90లక్షల చొప్పున వెచ్చించి కొనుగోలు చేశారు. తల్లాడ మండలంలో 27గ్రామపంచాయతీలు ఉండగా వాటిలో నిధులున్న సౌలభ్యతను బట్టి కొన్ని గ్రామపంచాయతీల్లో ఒకేసారి పూర్తి నగదు చెల్లించి ట్రాక్టర్, ట్రక్కు, ట్యాంకర్లను కొనుగోలు చేశారు. సరిపడా నిధులు లేని మరికొన్ని గ్రామపంచాయతీలు తల్లాడలోని ఎస్‌బీఐలో నెలవారీ వాయిదాల చెల్లింపు(ఈఎంఐ) పద్ధతిలో రుణం తీసుకొని కొనుగోలు చేయడం జరిగింది. బ్యాంకులో రుణం తీసుకున్న ఒక్కొక్క గ్రామపంచాయతీ నెలకు రూ.13,500 చొప్పున కిస్తీలు చెల్లించాల్సి ఉంది. గ్రామపంచాయతీలకు రాష్ట్రప్రభుత్వం నుంచి ప్రతినెలా వచ్చే రాష్ట్ర ఆర్థికసంఘం నిధులు రెండేళ్లుగా, కేంద్రప్రభుత్వం నుంచి రావల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు మూడునెలలుగా నిలిచిపోయాయి. దీంతో ఆదాయ వనరులు లేని చిన్నగ్రామపంచాయతీలు నిధుల కొరతతో సతమతమవుతున్నాయి. ప్రతినెలా ట్రాక్టర్‌కు నెలవారీ రూ.13,500చొప్పున కిస్తీలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. మండలంలోని మంగాపురం, బాలపేట, కొత్తవెంకటగిరి, నూతనకల్, లక్ష్మీపురం, వెంగన్నపేట, బస్వాపురం, కేశ్వాపురం, రేజర్ల, తెలగవరం, గోపాలపేట తదితర గ్రామపంచాయతీలు మూడునెలలుగా బ్యాంకుకు కిస్తీలు చెల్లించటం లేదు. నెలలతరబడి కిస్తీలు చెల్లించలేని పరిస్థితి ఉండటంతో గ్రామపంచాయతీల ట్రాక్టర్లను రుణం ఇచ్చిన బ్యాంకు జప్తు చేసే పరిస్థితి నెలకొంది.





పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

దొడ్డా శ్రీనివాసరావు, ఎంపీపీ, తల్లాడ

గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావల్సిన 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయాలి. రెండు సంవత్సరాలుగా రాష్ట్రప్రభుత్వం, మూడునెలలుగా కేంద్రప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీలకు నిధులు విడుదల కావడం లేదు. దీనివల్ల బ్యాంకు నుంచి రుణం తీసుకున్న ట్రాక్టర్లకు నెలవారీ కిస్తీలు చెల్లించలేని పరిస్థితి ఉంది. ట్రాక్టర్లకు నెలవారీ కిస్తీలు చెల్లించకపోవడం వల్ల బ్యాంకులు వాటిని జప్తు చేసే పరిస్థితి ఉంది. నిధుల కొరత వల్ల గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత కార్యక్రమాలు కూడా సక్రమంగా నిర్వహించటం లేదు.

బీఎస్ఎన్ఎల్‌కు పెరుగుతున్న ఆదరణ

ఫ్రీ సిమ్ మేళాకు అపూర్వ స్పందన ▸ పూర్వవైభవం దిశగా అడుగులు: డీఈ



సిమ్ కోసం బారులు తీసిన వినియోగ దారులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 17: బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్లను అందుబాటులోకి తీసుకురావడంతో రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, తదితర ప్రాంతాలలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఫ్రీ సిమ్ మేళాకు అపూర్వ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా కొత్తగూడెంలో గత ఐదు రోజుల నుంచి ఏర్పాటు చేసిన ఈ మేళాలో సుమారు 400ల మంది కొత్త మొబైల్ వినియోగదారులతోపాటు, 150మంది వివిధ నెట్ వర్క్ నుంచి పోర్ట్ అవుట్ చేసుకొని బీఎస్ఎన్ఎల్ నెట్ వర్క్‌లోకి మారారు. ఈ విధంగా 550మంది మొబైల్ వినియోగదారులు ఈ మెగా మేళాలో వినియోగదారులకు 4జీ సిమ్ కార్డును ఉచితంగా అందజేశారు.

పూర్వ వైభవం దిశగా అడుగులు: డీఈ సుభాష్

బీఎస్ఎన్ఎల్ సంస్థకు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా ప్రణాళికబద్ధంగా ఉన్నత అధికారుల సూచనల మేరకు పని చేస్తున్నామని తెలిపారు. కస్టమర్లను ఆకర్షించేలా వివిధ ప్రత్యేక ఆఫర్లను ప్రైవేట్ కంపెనీలకు దీటుగా అందిస్తూ సేవలను మరింత విస్తృతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఎఫ్‌టీటీహెచ్ ల్యాండ్ ఫోన్లను ప్రజలకు మరింత చేరువ చేసే పనిలో నిమగ్నమవుతున్నారని తెలిపారు.

వడివడిగా 'సీతారామ'

(3వ పేజీ తరువాయి)

పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం సత్తుపల్లి, బీరోలు టన్నెల్ పనులు నడుస్తుండగా జూలూరుపాడు టన్నెల్ పనులు ప్రారంభించాల్సి ఉంది. ఈ పరిస్థితి గుర్తించిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని తీసుకువచ్చి అశ్వాపురం మండలంలోని అమ్మగారిపల్లి నుంచి ఏన్కూరు లింక్‌కెనాల్ వరకు పనులను పరిశీలించి వారికి ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించారు.

కొద్దిపాటి పనులు పూర్తి చేస్తే ఈ ఏడాది ఆగస్టు 15వరకే సుమారు లక్షన్నర ఎకరాలకు నీరివ్వవచ్చని తెలపడంతో ప్రభుత్వం నుంచి సానుకూలత వచ్చింది. భద్రాచలం పర్యటనకు వచ్చినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి కూడా మంత్రి తుమ్మల సూచన మేరకు ఏన్కూరు లింక్‌కెనాల్ పనులకు అంగీకరించారు. దీంతో యుద్ధప్రాతిపదికన ఏన్కూరు లింక్‌కెనాల్ పనులు కొనసాగుతున్నాయి. కమలాపురం లిఫ్ట్‌కెనాల్ నుంచి ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు తరలించడంతో సాగర్ జలాలతో సంబంధం లేకుండా గోదావరి జలాలతో ఆయకట్టుకు నీరందనుంది.

మొదటి పంపుహౌజ్ అయిన బీజీ కొత్తూరుకు దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మోటార్లను అమర్చగా ఇక్కడి అధికారులే వాటికి ట్రయల్‌రన్ నిర్వహించారు. పూసుగూడెం, కమలాపురం పంపుహౌజ్‌లకు చైనాలోని షాంగ్రై కంపెనీకి చెందిన 250మె.వా మోటర్లను ఏర్పాటు చేశారు. వీటి ట్రయల్‌రన్ నిర్వహించాలంటే చైనా నుంచి ఆ కంపెనీ అధికారులు రావాల్సి ఉండడంతో ట్రయల్ రన్ నిలిచిపోయింది. దీంతో మంత్రి తుమ్మల చొరవ తీసుకుని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సీఎం పేషీతో మెగా కంపెనీ ప్రతినిధులతోనూ ఢిల్లీలోని విదేశీ వ్యవహారాలశాఖ అధికారులతోనూ మాట్లాడి త్వరగా షాంగ్రై కంపెనీ నిపుణుల బృందానికి వీసా మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారు. దీంతో ఈనెల 22న చైనా నిపుణుల బృందం ఇండియాకు వస్తున్నట్టు సమాచారం. వారు వచ్చిన వెంటనే ఈ నెలాఖరులోగా ట్రయల్‌రన్ పూర్తిచేయనున్నారు. ట్రయల్‌రన్ విజయవంతమైతే ఆగస్టు 15కి సీతారామ జలాలు వైరా రిజర్వాయర్‌కు అందే అవకాశం ఉంది.

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

- ఆగస్టు 5 వరకు నిర్వహణ
- ఖమ్మం జిల్లాలో 6, కొత్తగూడెంలో ఒక కేంద్రం ఏర్పాటు
- ప్రతిరోజూ రెండు విడతల్లో పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖ అధికారులు
- పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలు

ఖమ్మం ఖానాపురం హవేలి/ఖమ్మం క్రైం/కొత్తగూడెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): టీజీ డీఎస్సీ పరీక్షలు గురువారం నుంచి ఆగస్టు 5వరకు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ బుధవారం తెలిపారు. కంప్యూటర్ ఆధారితంగా(సీబీటీ) నిర్వహించే ఈ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు విడతల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఖమ్మం నగరంలో ఐదు, సత్తుపల్లిలో ఒక కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆరు పరీక్షా కేంద్రాల్లో రోజుకు సుమారు 1800మంది హాజరుకానున్నట్టు తెలిసింది. జిల్లాలో మొత్తం 30వేల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు సమాచారం. పరీక్షల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఈవో తెలిపారు. ఖమ్మం జిల్లాలో బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల, దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాల, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల, విజయ ఇంజనీరింగ్ కళాశాలలతోపాటు సత్తుపల్లిలోని మదర్‌థెరిసా ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు హాజరవుతున్న వారిలో 137మంది దివ్యాంగ అభ్యర్థులు ఉండగా వారు పరీక్షలు రాసేందుకు సహాయకులు కావాలని దరఖాస్తులు అందించారని డీఈవో తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సుజాతనగర్ మండలంలోని అబ్దుల్‌కలాం ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ కేంద్రంలో మొత్తం 3,380మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ కేంద్రంలో ప్రతి షిఫ్ట్‌లోనూ 130 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష ప్రారంభానికి ఒక్కనిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరు. ఈ పరీక్ష కేంద్రానికి అబ్జర్వర్లుగా కొత్తగూడెంలోని మేదరబస్తీ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బీవీఎల్. కుమార్, ఎర్రగుంట జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఈవో ఆనంద్‌కుమార్‌లు వ్యవహరించనున్నారు.

డీఎస్సీ పరీక్షల నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163వ సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని, పరీక్షా కేంద్రాలకు 200మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండవద్దని తెలిపారు. ఎలాంటి సభలు, సమావేశాలు ర్యాలీలు మైక్‌లకు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ ఆంక్షలు అమలు చేస్తున్నట్టు తెలిపారు.

మూతబడుతున్న పాఠశాలలు..

- గ్రామాల్లో పిల్లలను ప్రయివేట్ పాఠశాలలకు తరలిస్తున్న వైనం
- ఉపాధ్యాయుల కొరత మరో కారణం

కల్లూరు, జూలై 17: కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు లేక, ఇప్పటికే పలు పాఠశాలలు మూతబడ్డాయి, మరోవైపున ఈ ఏడాది కూడా మరి కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు చేరకపోవడంతో తాజాగా మరో ఐదు పాఠశాలలు మూతపడేదశలో సిద్ధంగా ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు స్థానికంగా అందుబాటులో ఉండకుండా సుదూర ప్రాంతాల నుంచి వస్తూ విధులు నిర్వహించడం, మరో వైపున విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్యాపట్ల భరోసా కల్పించక పోవడం, ఉపాధ్యాయుల కొరత కారణంగా వరుసగా గత ఏడాది క్రితం దారుగబంజర, చిన్నకోరుకొండి (ఎంఎల్‌సీ), విశ్వానాథపురం, లక్ష్మీపురం, రామానగర్ (కల్లూరు), పేరువంచ (హెచ్‌డబ్లూ), రామకృష్ణపురం, ఓబుల్‌రావు బంజర, పాఠశాలలు మూతపడ్డాయి. అదే వరుస క్రమంలో ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాలు లేక మండలంలోని రఘునాథగూడెం, ఎర్రబోయనపల్లి (హెచ్‌డబ్లూ), పాయపూరు, యజ్ఞనారాయణపురం, తూర్పులోకవరం గ్రామాల్లో గల ప్రాథమిక పాఠశాలల్లో సగటున నాలుగు నుంచి ఏడు వరకే పిల్లలు ఉన్నారు. ఇలా ఆయా పాఠశాలల్లో 1 నుంచి ఐదు తరగతుల వరకు సగటున ఒక్క ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయా పాఠశాలల్లో కూడా ఈ ఏడాది కొత్తగా విద్యార్థుల ప్రవేశాల లేనందున ఇక అవి కూడా ఈ ఏడాదిలోగానే మూత పడే దశలో ఉన్నాయి. గతంలో ఆయా గ్రామాల్లో విద్యార్థుల ప్రవేశాలు ఉండి విద్యాబోధనతో కళకళలాడేవి. అందుకు భిన్నంగా పలు రకాల కారణాల ఫలితంగా ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఇలా పాఠశాలలు మూతపడే దశకు చేరుకుంటున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ విద్యబోధనకు నోచుకోలేక ఆర్థికభారంతో ప్రయివేట్ పాఠశాలలకు పంపాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఓ పాఠశాలలో నలుగురు పిల్లలతో ఒకే ఉపాధ్యాయుడు



విద్యార్థుల ప్రవేశాలు లేక మూతపడే దశలో ఉన్న వైన్‌పురం పాఠశాల

బడిబాట కార్యక్రమాలు చేపట్టినా ఫలితం శూన్యం...

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఏడాది బడిబాట కార్యక్రమాలు చేపట్టిన ఫలితం శూన్యం. గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్య బోధనపై విద్యార్థుల తల్లిదండ్రులు భరోసా కోల్పోవడంతో ఎక్కువ శాతం ప్రయివేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. అందుకు ప్రభుత్వం తరుపున పలు రకాల కారణాలు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు అణుగుణంగా ఉపాధ్యాయులు లేక పోవడం, ఖాళీలు ఏర్పడడం, ఉన్న ఉపాధ్యాయుల్లో కొంతమందిలో పనీతీరు లోపించడం వంటి కారణాల వల్ల పై విధంగా మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలు మూతబడి భవనాలు వెక్కిరిస్తున్నాయి. బడిబాట కార్యక్రమం కూడా అంతంత మాత్రంగా సాగడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ బడులు మూతబడకుండాచూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మీ సహకారంతోనే ముందుకు..



మంత్రి తుమ్మలకు జ్ఞాపికను అందిస్తున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల

● మంత్రి తుమ్మలను సన్మానించిన రాయల

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 17: రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు వ్యవసాయశాఖ మంత్రి ఆశీస్సులు ఎప్పుడు ఉండాలని మీ సహకారంతోనే ముందుకు వెళ్తామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును రాయల నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తుమ్మలకు జ్ఞాపికను అందించి శాలువాతో సన్మానించారు. వ్యవసాయశాఖ అండతోనే రైతులకు గిడ్డంగుల సంస్థ ద్వారా సేవలు అందించటానికి సహకారం కావాలని కోరారు. నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, ఎన్వీ తదితరులు పాల్గొన్నారు.

● తుమ్మలను కలిసిన రాష్ట్ర ఇరిగేషన్ చైర్మన్ మువ్వా

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 17: రాష్ట్ర ఇరిగేషన్ సంస్థ చైర్మన్‌గా నియామకం జరిగిన మువ్వా విజయ్‌బాబు బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఇరిగేషన్‌శాక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 21న తాను పదవీ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా మంత్రులను ఆహ్వానించారు.



తుమ్మలకు పుష్పగుచ్చం అందిస్తున్న రాష్ట్ర ఇరిగేషన్ సంస్థ చైర్మన్ మువ్వా

పెద్దవాగు మరమ్మతులపై

భగీరథ ప్రయత్నం..

- కాల్వ వద్ద తెగిన కరకట్ట
- ఎప్పటి మాదిరిగానే ప్రవహిస్తున్న పెద్దవాగు
- పొంచి ఉన్న బ్రిడ్జి రహదారి

కరకగూడెం, జూలై 17: మండలంలోని కరకగూడెం చిరుమళ్ల- వెళ్లే గ్రామాల మధ్య పెద్దవాగు వద్ద గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వరద ప్రవాహంతో రహదారి పూర్తిగా కోతకు గురైంది. దీంతో పలు గ్రామాలకు సుమారు మూడు నెలలు రాకపోకలు నిలిచాయి. గత ఏడాది కోతకు గురైన రహదారిని అధికారులు గ్రావెల్ పోసి వదిలేశారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు రహదారి కుంగిపోయింది. దాంతో ఇటీవల 'పెద్దవాగు ప్రవాహంతో పొంచి ఉన్న ప్రమాదం' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురించడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ రహదారి పరమ్మతులకు రూ.9లక్షల 80వేలు మంజూరు చేశారు. ఇందులో రూ.5లక్షలు వాగునీరు మళ్లీచేందుకు కాల్వ కోసం, కుంగిన రహదారి మరమ్మతు కోసం రూ. 4 లక్షల 80వేలను ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేశారు. అనంతరం పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ కాలువ పనులను చేపట్టారు. రహదారి వైపు వాగు నీరు పోకుండా మధ్యలో కాలువను ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి కరకట్ట తెగింది. పెద్దవాగు వరద ప్రవాహంతో కరకట్ట తెగడంతో మరల పెద్దవాగు నీరు పాత పద్ధతిలోనే ప్రవహిస్తుంది. అధికారులు చేసిన భగీరథ యాత్నలు తుంగలో తొక్కినట్లు అయిందని మండల ప్రజలు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా పెద్దఎత్తున వర్షం కురిస్తే పెద్దవాగు ప్రవాహంతో బ్రిడ్జి వద్ద రహదారికి ప్రమాదం వస్తుందని.. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికే రహదారి కుంగిందని పలు గ్రామాల వాపోతున్నారు. ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే పూర్తి స్థాయి మరమ్మత్తులు చేపట్టాలని మండల ప్రజలు కోరతున్నారు.



కాలువ నుంచి వస్తున్న పెద్దవాగు వరదనీరు

భక్తి శ్రద్ధలతో మొహర్రం

ఖమ్మం సాంస్కృతికం, జూలై 17: త్యాగానికి ప్రతీక అయిన మొహర్రంను బుధవారం ఖమ్మం నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.. ముస్లింలే కాక హిందువులు సైతం పెద్దఎత్తున ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు. కొందరు హిందువులకు సైతం పీర్లను కొలిచే సంప్రదాయం ఉండటంతో వారి వారసులు ఇప్పటికీ కార్యక్రమాల్లో పాల్గొంటు న్నారు. పీర్లను నిలిపి కొలిచే సంస్కృతిని పాత ఖమ్మం ప్రాంతంలో ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. శుక్రవారపేట, రిక్కాబజార్, మోమినాన్, రాతి దర్వాజ, చెరువు బజార్, తదితర ప్రాంతాల్లోని పీర్ల కొట్టాలలో నిలిపిన పీర్లను ఆచారం మేరకు నిమజ్జన కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా పలుచోట్ల నిలిపిన పీర్లను కోట బురుజు ప్రాంతానికి ఊరేగింపుగా తీసుకురావడంతో ప్రజలు పెద్దఎత్తున చేరుకొని వీక్షించారు. దూది పీరి, గొడుగు పీరి, కత్తి పీరి, నకాశిపీరి, తదితర పీరీలు ఒక్కొక్కటిగా వస్తుండగా భక్తులు ఎదురేగి పూజలు నిర్వహించారు. దారి పొడవునా హిందువులు సైతం నీళ్ల బిందెలను తెచ్చి పీర్ల వద్ద కుమ్మరిస్తూ ప్రసాదాలు, కానుకలు చదివిస్తూ ముజావర్ల దీవెనలు పొందారు. కాగా, నగర మేయర్ పునుకొల్లు నీరజ మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. రిక్కాబజార్‌లోని పీర్లకొట్టాన్ని సందర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.



సత్తుపల్లి ట్రంక్‌పై దృష్టి

- యాతాలకుంట టన్నెల్ పూర్తయితే సత్తుపల్లికి గోదావరి జలాలు
- 1,671 మీటర్లకు గాను 550 మీటర్లు పూర్తయిన టన్నెల్
- నిధుల మంజూరుకు ప్రయత్నిస్తున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, జూలై 17: సీతారామ ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా సత్తుపల్లి ట్రంక్ పనులు పూర్తి చేయించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. సీతారామ ద్వారా ముందుగా వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను మళ్లించాలనే లక్ష్యంతో పనులు వేగంగా జరుగుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా ఇటీవల మొదటి ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. ఆగస్టు మాసాంతానికి పనులన్నీ పూర్తి చేసి, వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దిశగా అధికారులు పనులు వేగంగా చేస్తున్నారు. ఒక వైపు వైరా రిజర్వాయర్‌కు మళ్లించే ప్రక్రియకు పరిస్థితులు అన్ని అనుకూలిస్తుండగా, మరో పక్క సత్తుపల్లి ట్రంక్‌పై ప్రభుత్వం దృష్టి సారించింది.



సీతారామ ఎత్తిపోతల పథకం కాలువ

సత్తుపల్లి ట్రంక్ ఇలా...

సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో సత్తుపల్లి ట్రంక్‌లో 9, 10,11,12 ప్యాకేజీలు ఉన్నాయి. వీటిలో సత్తుపల్లి మండలం యాతాలకుంట వరకూ 9వ ప్యాకేజీ, అక్కడి నుంచి మల్లెపూల వాగు వరకు 10వ ప్యాకేజి, 11వ ప్యాకేజి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని పంప్‌హౌస్ ఉంటాయి. అక్కడి నుంచి 12వ ప్యాకేజిలో అశ్వారావుపేట ప్రాంతంలో ఉంది. వీటిలో సత్తుపల్లి మండలంలోని యాతాలకుంట వద్ద టన్నెల్ (సొరంగం) నిర్మాణం, దమ్మపేట మండలంలోని పంప్‌హౌస్ నిర్మాణంతో పాటు పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలు పరిష్కారం కావాల్సి ఉంది.

టన్నెల్ నిర్మాణం పూర్తి అయితే కమలాపురం పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలు కాల్వల ద్వారా దమ్మపేట మండలం నాగుపల్లి సమీపంలోని మల్లెపూల వాగులో చేరుతాయి. అక్కడి నుంచి బేతుపల్లి పెద్ద చెరువుకు మళ్లిస్తారు. బేతుపల్లి పెద్ద చెరువు నుంచి ఇప్పటికే వాడుకలో ఉన్న ఎన్టీఆర్ ప్రత్యామ్నాయ కాలువ ద్వారా వేంసూరు మండలంలోని చెరువులన్నింటినీ నింపనున్నారు. వైరా రిజర్వాయర్ ద్వారా నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా సీతారామా నీటిని పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ మధ్య తరహా నీటి పారుదల ప్రాజెక్టుకు తరలిస్తారు. వీటి ద్వారా సత్తుపల్లి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇక 11వ ప్యాకేజీలోని పంప్‌హౌస్, 12వ ప్యాకేజిలో పనులు పూర్తి అయితే అశ్వారావుపేట నియోజకవర్గంలో పలు గ్రామాలకు గోదావరి జలాలు అందనున్నాయి.

సత్తుపల్లి ట్రంక్ 9వ ప్యాకేజిలో టన్నెల్, కాలువలు, స్ట్రక్చర్ల నిర్మాణాలకు రూ.350 కోట్లు అవసరం ఉంది. ఇందులో టన్నెల్ నిర్మాణం అంచనా వ్యయం రూ.120కోట్లు కాగా. భూ సేకరణ కూడా పెండింగ్‌లో ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లిలో నాలుగు కిలోమీటర్ల మేర భూ సేకరణ ఆగిపోయింది. ఆర్ ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన వారికి సంబంధించిన భూముల పరిహారం సమస్య ఉంది. యాతాలకుంటలో భూసేకరణ పరిహారం రైతులకు అందాల్సి ఉంది. భూ సేకరణకు మొత్తం రూ.40కోట్లు పెండింగ్‌లో ఉండగా, గతంలో రూ.5కోట్లు, ఇటీవల రూ.10కోట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేయించారు. యాతాలకుంట గ్రామంలో మరో రూ.4 కోట్లు రైతులకు అందాల్సి ఉంది. సీతారామ ప్రాజక్టు పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న మంత్రి తుమ్మల సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలు మళ్ళించాలనే పట్టుదలతో కృషి చేస్తున్నారు. టన్నెల్ నిర్మాణం పూర్తి చేసేందుకు, కాలువలు, స్ట్రక్చర్ల నిర్మాణం, భూసేకరణకు సంబంధించి నిధులు మంజూరు చేయించేందుకు తుమ్మల ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడాది కాలంలో పనులన్నీ పూర్తయితే సత్తుపల్లి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు గోదావరి జలాలు అంది కొత్త ఆయకట్టుతో పాటు పాత ఆయకట్టు స్థిరీకరణ జరిగే అవకాశం ఉంది.



టన్నెల్ పూర్తయితే గోదావరి జలాలు

సీతారామ ద్వారా ఇప్పటికే వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు మళ్లించేందుకు పనులు పూర్తి చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే కమలాపురం పంప్‌హౌస్ నుంచి సత్తుపల్లి మండలం యాతాలకుంట మీదుగా సత్తుపల్లి ప్రాంతానికి గోదావరి జలాలు మళ్లించేందుకు డిజైన్ చేశారు. ఇందులో భాగంగా సత్తుపల్లి మండలం యాతాలకుంటలో టన్నెల్ నిర్మాణం కొనసాగుతోంది. అతికష్టమైన టన్నెల్ నిర్మాణం వేగంగా ముందుకు సాగే పరిస్థితి లేకుండా ఉంది. ఇక్కడి నేల.. రాళ్ల నేల కాకపోవడంతో మెత్తటి మట్టి కావడంతో సొరంగం తవ్వే సమయంలో కూలిపోయే పరిస్థితి ఉంది.

దీంతో రోజుకు రెండున్నర మీటర్లు సొరంగం చేసి, ఆ తరువాత మట్టిని బయటకు తరలించి అవసరమైన నిర్మాణ, కాంక్రీట్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు మీటర్ల సొరంగం కాంక్రీట్ పనులకు రెండు రోజులు సమయం పడుతోంది. దీంతో టన్నెల్ నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగడం లేదు. మొత్తం 1,671 మీటర్ల టన్నెల్ నిర్మాణానికి గాను, ఇప్పటి వరకు 550 మీటర్లు మాత్రమే పనులు పూర్తయ్యాయి. దీని నిర్మాణంపై అధికారులు దృష్టి సారించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారుడి ప్రతిభ



రన్నరప్ ట్రోఫీ సాధించిన వినయ్

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 17: మెదక్‌లో ఈనెల 14 నుంచి 17 వరకు జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో నగరానికి చెందిన అబ్బూరి వినయ్ సత్తాచాటి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నాడు. అండర్-15 సింగిల్స్ బాలుర విభాగంలో పాల్గొన్న వినయ్ ఫైనల్స్ పోటీలో స్వల్ప స్కోరు తేడాతో రన్నరప్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలలో ప్రతిభ చూపిన వినయ్‌ను జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ ఘంటా వెంకట్రావు, అధ్యక్షుడు తమ్మినేని వెం కట్రావు, సెక్రెటరీ ఉప్పల్‌రెడ్డి, ట్రెజరర్ చంద్రశేఖర్ తదితరు లు అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి మొబైల్ నెంబర్లు

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 17: మహాలక్ష్మి పథకం నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిన కారణంగా ప్రయాణికులకు ప్రయాణ సమయంలో ఎదురయ్యే వివిధ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకరావటానికి వీలుగా ఖమ్మం రీజియన్ పరిధిలోని ఏడు డిపోల పరిధిలో మొబైల్ ఫోన్‌లకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రీజనల్ మేనేజర్ సరిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నూతన బస్టాండ్-99592 25979, సిటీ బస్టాండ్-99592 25979, మధిర-73829 25289, సత్తుపల్లి-99592 25990, భద్రాచలం-99592 25987, కొత్తగూడెం-99592 25987, మణుగూరు -89853 61796, నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం



భద్రాచలం జూలై 17: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి అన్నదాన సత్రం సమీపంలో బుధవారం గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు భద్రాచలం పట్టణ ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు. మృతురాలిని ఎవరైనా గుర్తించి వివరాలు తెలిస్తే భద్రాచలం పట్టణ ఎస్ఐ ఫోన్ నెంబర్ 87126 82160కు సమాచారం అందించాలని సూచించారు.

'కొత్త నేర చట్టాలపై అవగాహన అవసరం'

ఖమ్మం లీగల్ జూలై 17: అడ్వకేట్ జాయింట్ యాక్షన్‌కమిటీ ఆధ్వర్యంలో కొత్తనేర చట్టాలపై అవగాహన ఉండాలని పలువురు న్యాయవాదులు అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలో ఓ హోటల్‌లో కొత్త నేర చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పలువురు పాల్గొని మాట్లాడారు. కొత్త నేరచట్టాలైన భారతీయ న్యాయసంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్షా అధినీయం చట్టాలపై చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హనుమంతరావు అవగాహన కల్పించారు. చట్టాలపట్ల ప్రజలకు సామాజిక అవగాహన కల్పించాల్సిన బాధ్యత న్యాయవాదులదేననన్నారు. న్యాయవాదులు నిత్యం విద్యార్థులుగా ఎప్పుడు అధ్యయనం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది ఈశ్వరప్రగడ హరిబాబు, ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్‌రావు, సీనియర్ న్యాయవాది బిచ్చాల తిరుమలరావు, సోహస్ సొసైటీ అధ్యక్షుడు తాళ్లూరు దిలీప్ పాల్గొన్నారు.

జట్టుగా విజయం సాధిద్దాం: ఆర్ఎం



ఉద్యోగులను అభినందిస్తున్న ఆర్ఎం సరిరాం

సత్తుపల్లి, జులై17: లోటుపాట్లను సరిచేసుకుంటూ స్థాయిని మరిచి, చేయిచేయి కలిపి జట్టుగా విజయం సాధిద్దామని ఖమ్మం రీజనల్ మేనేజర్ అజ్మీర సరిరాం అన్నారు. బుధవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోను ఆయన తనిఖీ చేశారు. బస్సుల పనితీరు, ఉద్యోగుల స్థితిగతులు, రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం 'లక్ష్యేలక్ష్యంగా కార్యక్రమం'లో భాగంగా నిర్వహించిన ఆటపాటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. అదేవిధంగా ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ప్రశంసాపత్రాలతో పాటు అవార్డులను అందించి సన్మానించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని డిపోలలో బస్సులతో పాటు డ్రైవర్ల కొరత ఉన్నప్పటికీ, సమస్యలను అధిగమించి శక్తికి మించి పనిచేస్తున్నామన్నారు. ఇందుకు సహకరిస్తున్న ఉద్యోగులను ఆయన అభినందించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లను విజయవంతంగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. డీలక్స్ సర్వీస్‌లలో మహిళలు ప్రయాణించేలా లక్కీడిప్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి బహుమతులు అందిస్తున్నామన్నారు. పంచసూత్రాలను పాటిస్తూ, ప్రయాణికులతో మర్యాదగా నడుచుకుంటూ, డిపోలను లాభాల బాటలోకి తేవాలని కోరారు. కాలం చెల్లిన బస్సుల స్థానంలో, రెగ్యులర్ బస్సులను తిప్పుతున్నామని పేర్కొన్నారు. ఇంకా రీజియన్‌లో 25కొత్త బస్సులు రావాల్సి ఉందని చెప్పారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలోని తల్లాడ, వీఎం.బంజర, మండలపల్లి, అశ్వారావుపేట బస్టాండ్‌లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. సత్తుపల్లి బస్టాండ్‌లో ఖమ్మం ప్లాట్‌ఫారం పక్కన ప్రయాణికుల సౌకర్యార్థం షెడ్ ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డీఎం రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితి, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ మునీర్‌పాషా, ఏడీసీలు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్ ద్వారా మోసపోయిన యువకుడు

- తక్కువ ధరకు ద్విక్రవాహనం వస్తుందంటూ బురిడి
- లక్ష్మీపురంలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన

ఆళ్లపల్లి, జూలై17: ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన సైబర్ నేరగాడి చేతిలో ఓ యువకుడు నగదు పోగొట్టుకున్న సంఘటన ఆళ్లపల్లి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆళ్లపల్లి మండలం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన గొగ్గల పృథ్వీరాజ్ అనే యువకుడు ఫేస్‌బుక్‌లో చూసి బైక్ తక్కువ ధరకు వస్తుందన్న ఆశతో క్లిక్ చేశాడు. దాంతో సైబర్ నేరగాడు మోసపూరిత ఫోన్ నంబర్ ద్వారా ఫోన్ చేసి తక్కువ ధరకు బైక్ అమ్ముతానని చెప్పి, విడతల వారీగా మొత్తం రూ.38,600 లను ఫోన్‌పే చేయించుకున్నాడు. డబ్బులు చెల్లించి రోజులు గడుస్తున్నపటికీ ద్విచక్రవాహనం రాకపోగా, పరిచయం అయిన ఫోన్ నంబర్ స్విచ్ ఆఫ్ రావడంతో ఆ యువకుడు మోసపోయినట్టు తెలుసుకున్నాడు. దాంతో ఆ యువకుడు ఆళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ రతీష్ సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మమ్మను హత్య చేసిన మనవడి అరెస్ట్

ఖమ్మం క్రైం జూలై 17: తాగటానికి డబ్బులు ఇవ్వలేదని అమ్మమ్మను హత్య చేసిన మనమడును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ బి.బాలకృష్ణ బుధవారం రాత్రి విలేకరులకు తెలిపారు. రోటరీనగర్‌కు చెందిన అమరబోయిన రాంబాయమ్మ(80) అనే వృద్ధురాలిని మనమడు ఉదయ్‌కుమార్ సోమవారం అర్ధరాత్రి కొట్టి హత్యచేసిన విషయం విదితమే. ఈ విషయమై మృతురాలి కుమారుడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో నిందితుడైన ఉదయ్‌కుమార్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని భార్యభర్తల మోసం

- పోలీసుల అదుపులో నిందితులు

ఖమ్మంక్రైం, జూలై17: ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసిన భార్యభర్తలను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపాలెం మండలం చింతగుర్తికి చెందిన సున్నం రాంబాబు, అతడి భార్య సంధ్యలు ఖమ్మం కలెక్టరేట్‌లో ఔట్ సోర్సింగ్‌లో ఉన్నాయని పలువురి వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారు.

దీంతో బాధితులు పలుమార్లు వారిని జాబ్ ఏదని అడగ్గా సరైన సమాధానం చెప్పకపోవడంతో అర్బన్ పోలీస్‌లను ఆశ్రయించారు. ఈ క్రమంలో ఖానాపురానికి చెందిన మాలిక్ నవ్య ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కాగా సదరు భార్యభర్తలను ఖానాపురంహవేలి పోలీసులు వారి గ్రామానికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు.

జూపెడ గ్రామంలో విషాదం

- నీట మునిగి వ్యక్తి మృతి
- సూర్యాపేట జిల్లాలో ఘటన



శ్రీపాల్‌రెడ్డి


తిరుమలాయపాలెం, జూలై17: మండలంలోని జూపెడ గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన తిప్పారెడ్డి శ్రీపాల్‌రెడ్డి (45) బుధవారం తన బంధువులైన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం బొప్పారం గ్రామంలో ఫంక్షన్‌కు వెళ్లా డు. సరదాగా ఈతకొట్టేందుకు కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ సమీపంలోని గ్రానైట్ క్వారీలో ఈతకెళ్లారు. శ్రీపాల్‌రెడ్డి, మరో ఇద్దరితో కలిసి ఈతకు దిగాడు. క్వారీలో నీరు అధికంగా ఉండడంతో దానిలో మునిగిపోయాడు. స్థానికు లు అతడిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కాగా మృతదేహాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు నరేష్‌రెడ్డి, ఓర వెంకటేశ్వర్లు, సుమన్‌రెడ్డి, కృష్ణ, నూకల రంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నిమ్మల నర్సింహారెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రేషన్‌బియ్యం పట్టివేత

ముదిగొండ, జూలై 17: మండలంలోని చిరుమర్రి వద్ద బుధవారం 37క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. చిరుమర్రి గ్రామానికి చెందిన నల్లొండ ఎల్లేశ్వరరావు, మోరా రామారావు ఇళ్లలో సమాచారం మేరకు తనిఖీ చేయగా, నిల్వ ఉంచిన 37క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని, సీజ్ చేసి సివిల్‌సప్లయి అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా సవార్ల వేడుక

- రెండు జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు



గ్రామాల్లో పీరీల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కరకగూడెం, జూలై 17: మండల కేంద్రంలోని దర్గ (పీరిల గుడి)వద్ద మంగళవారం మొహరం సందర్భంగా రాత్రి ముజావార్లు దర్గ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మటీకిలు, బెల్లం, తులసీ పానకం, దట్టిలు చేర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో భక్తులు మొక్కులు చెల్లించుకొని, అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. అంగరంగ వైభవంగా సరిగెత్తు రూపంలో సవార్ల వేడుకలను నిర్వహించారు. మొక్కులను చెల్లించుకునేందుకు ఇరు జిల్లాల నుంచే కాక, ములుగు జిల్లా తాడ్వాయి, మంగపేట, కాటపురం నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. వారికి ముజావార్లు ప్రసాదాలు అందజేశారు. బుధవారం రాత్రి మూజావార్లు పీరిలకు కర్బలు నిర్వహించి దర్గలోని పెట్టెలో భద్రపరుస్తారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దమ్మపేట, జూలై 17: రెడ్యాలపాడు గ్రామం నుంచి దమ్మపేటకు ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా, గుర్వాయిగూడెంలో పోలీసుల వాహన తనిఖీలో అనుమతులు లేకుండా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

ఏకకాలంలో రుణమాఫీని అమలు చేయాలి

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 17: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ స్వయంగా ప్రకటించిన రైతు రుణమాఫీని బేషరతుగా ఏకకాలంలోనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. బుధవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంతో 9లక్షల కుటుంబాలు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు. జీవో నెంబర్ 368ను ఏర్పాటు చేసి, రైతు రుణామాఫీ పొందే రైతుల సంఖ్యను కుదించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైతు రుణమాఫీపై కొర్రిలను పెడుతున్నారని ఆక్షేపించారు. జాయింట్ లైబులిటి గ్రూప్‌లు కలిగి ఉన్న రైతులకు రుణమాఫీ అమలు చేయకుంటే సన్న, చిన్నకారు రైతులకు రైతు రుణమాఫీ అమలు కాలేదని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రంలో 14లక్షల ఎకరాల్లో పోడు భూముల సర్వే చేపట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం 4లక్షల ఎకరాలను పంపిణీ చేసిందని అన్నారు. మిగిలిన పది లక్షల పోడు భూములను కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడునెలలు పూర్తైనా, ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని ఆరోపించారు. నూతన పింఛన్లు, గృహలక్ష్మి వాగ్దానాలు అమలు కాలేదన్నారు.

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 13 స్థానాల్లో ఇండియా కూటమి పది స్థానాల్లో గెలిచిందని, దేశ వ్యాప్తంగా ఓటర్లు ఫాసిజం, మతోన్మాదానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని, ప్రతిపక్షమే ఉండకూడదని భావించిన మోదీ ప్రభుత్వానికి పటిష్ఠమైన ప్రతిపక్షం ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా జైళ్లలో బందీలుగా ఉంచిన ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, పాత్రికేయులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసిన ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలను స్వయంగా పరిపాలన చేసే విధంగా ఉండాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేసేందుకు రాష్ట్ర కమిటీ పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈనెల 22న రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి, 29న కలెక్టరేట్ ముట్టడి, ఆగస్టు 21న ఛలో హైదరాబాద్‌కు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు పనిచేయాలని హితవు పలికారు. రాష్ట్ర కమిటీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రంగయ్య, కృష్ణ, ప్రభాకర్, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, పాయం చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, రామయ్య, ఆవుల ఆశోక్, సీవై. పుల్లయ్య పాల్గొన్నారు.

పాల్వంచలో 77కేజీల గంజాయి పట్టివేత

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



పట్టుబడ్డ గంజాయి, నిందితులతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పాల్వంచ, జూలై 17: కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలంలో పట్టుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నర్దేవ్‌సింగ్, అతుల్‌పాల్‌లు జల్సాలకు అలవాటు పడి గంజాయి రవాణా చేస్తున్నాడు. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్ తరలించడానికి ఓ కారును ఏర్పాటు చేసుకున్నాడు. అందులో గంజాయిని పేర్చి తరలిస్తుండగా సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామ శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొత్తగూడెం వైపు వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా అందులో 77 కేజీల ఎండు గంజాయి బయటపడింది. దీంతో కారులోని ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారిని పాల్వంచ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి ఒక కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.20లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. అనంతరం కేసును ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు పాల్వంచ ఎక్సైజ్ సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- ఇంజక్షన్ వికటించడం వల్లనే మృతి చెందాడని బంధువుల ఆరోపణ
- వైద్యుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కారేపల్లిలో ఘటన



లాలయ్య మృతదేహం

కారేపల్లి జూలై 17: చర్మ వ్యాధికి చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లిన ఓ వ్యక్తి అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్లు వికటించడం వల్లనే మృతి చెందాడని మృతుడి బంధువులు ఆరోపించారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కారేపల్లి మండలం మాణిక్యారం గ్రామానికి చెందిన రేపాకుల లాలయ్య(55) తన కున్న కొద్దిపాటి భూమిని కౌలుకుఇచ్చి ఖమ్మంలోని ఓ అపార్టమెంట్‌లో వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. అయితే కారేపల్లిలో తనకు పరిచయస్తుడైన సీపీఎం ఖమ్మం జిల్లా నాయకుడు కొండబోయిన నాగేశ్వరరావు ఇంటికి బుధవారం తన భార్యతో కలిసి వచ్చాడు. తరువాత షుగర్ బాధితుడైన అతడు ప్రస్తుతం చర్మవాధితో బాధపడుతుండగా కారేపల్లిలోని ప్రైవేటు వైద్యుడు సామినేని రాఘవులు వద్దకు బైక్‌పై వెళ్లాడు. లాలయ్యను పరిశీలించిన వైద్యుడు రాఘవులు ఇంజక్షన్ వేశాడు. అరగంట వ్యవధిలో ఐదు ఇంజక్షన్లు వేయడంతో లాలయ్య వెంట వచ్చిన కొండబోయిన ఉమావతి అన్ని ఇంజక్షన్లు ఎందుకు వేస్తున్నారని అడిగింది. అయినా వైద్యుడు వినిపించుకోకుండా ఇంజక్షన్లు వేశాడని, ఆ ఇంజక్షన్లు వేసిన అరగంటలోనే లాలయ్య మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. ఈ విషయం తెలిసిన వెంటనే కారేపల్లి మండల కేంద్రానికి చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు, మృతుడి బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు.

ఆసుపత్రి వద్ద పార్టీల నాయకులు, మృతుడి బంధువులు ఆందోళన చేపట్టడంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణ ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న కారేపల్లి ఎస్ఐ రాజారాం తన సిబ్బందితో ఆసుపత్రికి వచ్చి డాక్టర్ రాఘవులును అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా మృతిడి కుటుంబానికి రూ.50లక్షలు నష్టపరిహారం చెల్లించాలని పలువురు డిమాండ్ చేశారు. అయితే తాను చేసిన ఇంజక్షన్ల వల్ల లాలయ్య మృతిచెందలేదని డాక్టర్ రాఘవులు తెలిపారు.

ఇంజక్షన్ వికటించడం వల్లనే నా భర్త మృతి చెందాడు: మృతుడి భార్య వీరమ్మ

వైద్యం కోసం వచ్చిన నా భర్తకు డాక్టర్ రాఘవులు ఇచ్చిన ఇంజక్షన్లు వికటించడం వల్లనే మృతి చెందాడు. తెలిసిన వారి ఇంటికి వచ్చిన నా భర్త కారేపల్లిలోని వైద్యుడు రాఘవులు వద్దకు వెళ్లగా అక్కడ పలు రకాలు పరీక్షలు నిర్వహించిన అతడు వరసపెట్టి ఐదు ఇంజక్షన్లు వేశాడు. ఈ ఇంజక్షన్లు వికటించడం వల్లనే నాభర్త మృతి చెందాడు.

చిరుతానుపాడులో వైద్య శిబిరం

- స్పందించిన డీఎంహెచ్‌వో
- పలువురిని పరీక్షించిన వైద్యులు



చిన్నారికి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పాల్వంచ రూరల్, జూలై 17: పాల్వంచ మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న చిరుతానుపాడులోని ఆదివాసీల అనారోగ్య పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన 'మాయదారి రోగం' అనే కథనంపై అధికారులు, ప్రజాప్రతినిదులు స్పందించారు. చిరుతానుపాడు ఆదివాసీల అనారోగ్య పరిస్థితులపై ఐటీడీఏ పీవో స్పందించి గ్రామంలో వైద్య సేవలు అందించాలని వైద్యులకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే వైద్యబృందం గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఆదివాసీలకు వైద్య చికిత్సలు చేపట్టారు.

ప్రతి ఇంట్లో జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేశారు. ఒకరికి మలేరియా నిర్ధారణ అయింది. మిగతా వారికి మంచినీటి సమస్యతో జ్వరాలు వచ్చినట్లు వైద్యులు తెలిపారు. చిన్నారులకు ఒంటిపై ఉన్న దద్దుర్లకు జీడిగింజలను కాల్చి నూనెలో కలిపి రాయడం, వేర్ల పసర్లు వాడటం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని వైద్యులు తెలిపారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందజేసినట్లు వైద్య సిబ్బంది చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాకర్లు వినయ్, రాజు, ప్రతాప్, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ చైతన్యకుమార్, హెల్త్ అసిస్టెంట్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లిన కొత్వాల

పాల్వంచ మండలంలోని చిరుతానుపాడులో ఆదివాసీల అనారోగ్య పరిస్థితిపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని చూసి ప్రజాప్రతినిధులు రాష్ట్ర మార్క్‌ఫెడ్ సభ్యులు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్‌తో మాట్లాడారు. వైద్య బృందాన్ని పంపించి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. అదేవిధంగా పాల్వంచ జడ్పీటీసీ బరపాటి వాసు వైద్యలను ఉల్వనూరు నుంచి చిరుతానుపాడుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన గ్రామీణ వైద్యుడు




వెంకటేశ్వర్లకి సీపీఆర్ చేస్తున్న వైద్యుడు సుభాని

ములకలపల్లి, జూలై17: అత్యవసర సమయంలో సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు ఓ గ్రామీణ వైద్యుడు. బుధవారం మండలంలోని గండిప్రోలు గ్రామానికి చెందిన పాయం వెంకటేశ్వర్లకి గుండెపోటు రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అది గమనించిన కుటుంబసభ్యులు జగన్నాథపురం గ్రామంలో గ్రామీణ వైద్యుడు సుభాని వద్దకు తీసుకెళ్లారు. అతనికి గుండెపోటు వచ్చిందని గ్రహించి వెంటనే సీపీఆర్ చేశారు. సీపీఆర్ చేయడంతో ఆ వ్యక్తి స్పృహలోకి వచ్చారు. వెంటనే మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. వెంటనే స్పందించి సీపీఆర్ చేయడంతోనే వ్యక్తి ప్రాణాలు నిలిపిన సుభానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సీపీఆర్ చేసిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌కావడంతో ప్రాణాలు కాపాడిన గ్రామీణ వైద్యులు సుభానిని పలువురు అభినందించారు.

ఆరుగురిపై కేసు నమోదు

మణుగూరు, జూలై 17: వ్యక్తిని మోసగించిన కేసులో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వాపురం మండలం మిట్టగూడెం పిచుకలతండాకు చెందిన బానోత్ రాములుకి మణుగూరు పరిధిలోని 314/1/10/2 సర్వేనెంబర్‌లో 16 కుంటల స్థలాన్ని బొగ్గం రాజు, కొమరం వెంకటేశ్వర్లు, గజ్జల లక్ష్మారెడ్డి, జీ. భూసిరెడ్డి, బదావత్ నాగేశ్వరరావు, బొగ్గం రజిత అనే వారు అమ్మే ప్రయత్నం చేశారు. పలు ధఫాలుగా రాములు వారికి రూ.12లక్షల50వేలకు ఇచ్చాడు. కాగా రాములు కొన్న భూమి వద్ద వెళ్లగా, అది వివాదస్పదం అవ్వడంతో, తాను ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వమని వారిని కోరాడు. ఎంతకి నగదు ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు పై ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఖమ్మం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా దినేష్‌కుమార్



ఖమ్మంఖానాపురంహవేలి, జూలై17: ఖమ్మం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పి.దినేష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా రీజనల్ మేనేజర్ కార్యాలయంలో ట్రాఫిక్ సీఐగా(అసిస్టెంట్ మేనేజర్)గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఖమ్మం డిపో మేనేజర్‌గా వచ్చారు. గతంలో ఖమ్మంలో పనిచేసిన డిపో మేనేజర్ శ్రీనివాసరావును ప్రభుత్వం హైదరాబాద్ బస్‌భవన్‌కు బదిలీ చేసింది. నూతన డీఎం మాట్లాడుతూ డిపో అభివృద్ధికి కృషి చేస్తానని, డిపో పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగులకు, సిబ్బందికి అందు బాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లాలోని మంత్రుల సహకారం, ఆర్‌ఎం సహకారంలో కృషి చేస్తానన్నారు. డీఎంను కార్యాలయ సిబ్బంది కలిసి శుభాంక్షలు తెలిపారు.

ఎస్ఐ శ్రీనివాస్ ఆత్మహత్యపై విచారణ చేయించాలి

ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై17: అశ్వారావుపేట ఎస్ఐ శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై రిటైర్డు హైకోర్టు సింగిల్‌జడ్జితో విచారణ చేయించాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజా సంఘాల ఐక్యవేదిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐ శ్రీనివాస్‌ను వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన వారిని అటాచ్‌మెంట్ చేయడం కాదని, జైలుకు తరలించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు, లంబాడిహక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్, నాయకులు దేవల్ల నాగేశ్వరావు భూక్యా శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

దుర్గామల్లికార్జునస్వామి ఆలయానికి పలువురు విరాళం

పెనుబల్లి, జూలై17: వీఎంబంజర్‌లోని శ్రీదుర్గా మల్లికార్జునస్వామి దేవాలయంలో ముఖద్వార దేవతా విగ్రహాల నిర్మాణానికి బుధవారం విరాళం అందజేశారు. కేతేపల్లి వాసు, ధనలక్ష్మీ రూ.పదివేలు, బండి శ్రీను, విజయ రూ.ఐదువేలు, వలివేటి రాజశేఖర్, విజయశ్రీ రూ.ఐదువేలు, కొటారు పాండురంగారావు రూ.ఐదువేలను ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో వంగా చంద్రశేఖర్, ఆచంటి శ్రీనివాసరావు, బాణోతు జగన్, వెంకటేశ్వర రావు, వేముల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ నియంత్రిక ఏర్పాటు

చింతకాని, జూలై17: మండల పరిధిలోని రాఘవాపురంలో లోఓల్టేజ్ సమస్యతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడు తుండటంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. గతంలో గ్రామస్థులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన విద్యుత్ అధికారులు అదనంగా 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏడీఈ తిలక్, ఏఈ వెంకన్న, కొల్లి సీతయ్య, అబ్బూరి మహేష్, దొబ్బల నరసింహారావు, కనపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీ తీర్మానం మేరకే అభివృద్ధి పనులు

ఎర్రగడ్డ మాజీ సర్పంచ్ గడ్డికొప్పుల రాజు

తిరుమలాయపాలెం, జూలై17: మండలంలోని ఎర్రగడ్డ గ్రామ పంచాయతీలో 5 ఏళ్లలో జరిగిన అభివృద్ధి పనులన్నీ గ్రామ పంచాయతీ తీర్మానం మేరకే జరిగాయని గ్రామమాజీ సర్పంచ్ గడ్డికొప్పుల రాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎర్రగడ్డలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులపై బీఆర్ఎస్ నాయకులు బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తూ డబ్బులు ఇవ్వాలంటూ పంచాయతీ కార్యదర్శిని నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మహిళ అని చూడకుండా ఆమెను తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బెల్లం శ్రీధర్, గద్దల వెంకటయ్య, చీమ లక్ష్మయ్య, చింతలపూడి రామారావు, గద్దల సుదాకర్, నల్లమలకిరణ్‌కుమార్, ఉన్నం శేఖర్, పోట్ల వరప్రసాద్ పాల్గొన్నారు.,

దాడి ఘటనలో ఐదుగురిపై కేసు

కల్లూరు, జూలై 17: కల్లూరులోని శాంతినగర్‌లో మోటారు సైకిల్ అడ్డగించి ఓ యువకుడిపై దాడికి పాల్పడిన ఘటనలో ఐదుగురుపై స్థానిక పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. స్థానికంగా శాంతినగర్‌లో ఈ నెల 15న రాత్రి కంటిపూడి గోవర్ధన్ తన ఇంటికి వెళ్లుతున్నాడు. ఈక్రమంలో అదే కాలనీకి చెందిన వారు అడ్డగించి దాడి చేశారు. తలపై బలంగా కొట్టటంతో తీవ్రగాయమైంది. డబ్బులు చెల్లించాల్సిన విషయంలో ఈదాడి జరిగింది. గోవర్ధన్ తల్లి కంటిపూడి రాణి ఫిర్యాదుతో నిందితులపై స్థానిక ఎస్ఐ షాకీర్ కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి





గుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం, పాండురంగాపురం రామాలయంలో భక్తులు పూజలు



కాకర్లపల్లి రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ..



గార్లొడ్డ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శ్రీవారి గుడిమెట్ల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొలిఏకాదశి ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు.ఆలయంలో శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ మాట్లాడుతూ ఈరోజు నుండి నాలుగు నెలల పాటు భక్తులు చాతుర్మస దీక్షను ఆచరిస్తారని అన్నారు. ఈరోజు నుంచి దక్షాణాయనం మొదలవుతుందని వాతావరణంలో వచ్చే మార్పులు కారణంగా ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో శరీరానికి పేలాల పిండిని తింటే వేడిని కలిగిస్తుందని ఆలయాల్లో పేలాల పిండిని ప్రసాదంగా ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి,సూపరిండెంట్ బి.విజయకుమారి, జూనియర్ అసిస్టెంట్ ఇ.కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, సుదర్శన్‌శర్మ పాల్గొన్నారు.



తల్లాడలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో..



కల్లూరులో భగవద్గీత ఏకనామం పఠిస్తున్న భక్తులు



ఎస్పీ ఆఫీస్‌రోడ్డు శివాలయంలో..

త్యాగానికి ప్రతీక మొహర్రం

భక్తిశ్రద్ధలతో వేడుకలు

మొహర్రం పర్వదినాన్ని ముస్లింలు బుధవారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.. విషాదానికి ప్రతీకగా జరిపే ఈ వేడుకలో నిర్వాహకులు నల్ల దుస్తులు ధరించి పాల్గొన్నారు. హిందువుల సైతం పెద్ద ఎత్తున పాల్గొని మతసామరస్యాన్ని చాటారు. కొందరు హిందువులకు సైత పీర్లను నిలిపే కొలిచే సంప్రదాయం ఉండటంతో వారి వారసులు ఇప్పటికీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. - నెట్‌వర్క్



లచ్చగూడెంలో పీరీల ఊరేగింపు..



ముదిగొండలో..



బోనకల్‌లో..



ఎర్రుపాలెంలో..



ఏన్కూరులో..



ఎస్ఐను సన్మానిస్తున్న ముస్లిం మతపెద్దలు



తిరుమలాయపాలెంలో..



సుర్దేపల్లిలో పీరీలను ఊరేగిస్తున్న దృశ్యం

ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండేలా ప్రణాళిక

- కాంగ్రెస్ నాయకుడు దయాకర్‌రెడ్డి

ఖమ్మంరూరల్, జూలై 17: రెవెన్యూ, గృహనిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి బుధవారం మండలంలోని గొల్లగూడెం, పొన్నేకల్లు తదితర గ్రామాల్లో పర్యటించారు. నియోజకవర్గ ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం, నాణ్యమైన విద్యను అతితక్కువ ఖర్చుకే అందించేందుకు, గురుకులాలు అన్ని ఒకేచోట ఉండాలనే ఉద్దేశ్యంతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచన మేరకు ప్రభుత్వ భూములను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఏసీపీ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం, రిజిస్ట్రేషన్ తదితర కార్యలయాలన్నీ ఒకే చోట ఉంటే పరిపాలన సౌలభ్యంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి భావిస్తున్నట్లు తెలిపారు. పొన్నేకల్లులో ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటుకు కావాల్సిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, శాఖమూరి రమేష్, జొన్నల గడ్డ రవి, కొప్పుల చంద్రశేఖర్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



పొన్నేకల్లులోని స్థలాన్ని పరిశీలిస్తున్న దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: నియోజకవర్గంలో అవసరమైన, అవకాశం ఉన్న ప్రతీచోట చెక్‌డ్యాంలను నిర్మిస్తామని తుంబూరు దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి చెక్‌డ్యాంల నిర్మాణానికి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఇప్పటికే రామచంద్రాపురం సమీపంలో పాలేరు ఏటిపై ఉన్న చెక్‌డ్యాం ఎత్తు పెంచే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఏటిపైమరో చెక్‌డ్యాం నిర్మాణానికి గల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల మండల పరిధిలోని కట్టుకాచారం, సదాశివపురం గ్రామాల్లో చెక్‌డ్యాంల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించామన్నారు. మంత్రి అనుమతితో త్వరలోనే చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. నాయకులు నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, కొడాలి గోవిందరావు తదితరులు ఉన్నారు.

బాలుడికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న కాలనీవాసులు

ఖమ్మంరూరల్,జూలై17: ప్రమాదవ శాత్తు విద్యుత్ షాక్‌తో గాయపడిన బాలుడికి కాలనీవాసులు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని సాయిగణేష్ నగర్ కాలనీకి చెందిన భరత్ రెడ్డి అనే బాలుడు కొద్దిరోజుల క్రితం డాబాపై ఉన్న కోతులను కొట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్‌తో తీవ్ర గాయాల పాలయ్యాడు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొదుతున్న బాలుడిని కాలనీ వాసులు పరామర్శించారు. బాలుడి వైద్య ఖర్చులకు కాలనీ వాసులు బాలుడి తల్లి,దండ్రులు మధురెడ్డి, శోభలకు రూ2లక్షలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోటు శ్రీనివాస్‌రావు, భైరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రసాద్, జీవన్‌రెడ్డి, రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఆన్‌లైన్ తప్పులను సరిచేయాలి

ఖమ్మంకార్పొరేషన్, జూలై17: సీఎం సహాయనిధి ఆన్‌లైన్ విధానంలో నెలకొన్న తప్పులను సరిచేయాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు, ఉద్యమకారుడు లింగనబోయిన సతీష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం నూతనంగా మార్పులు చేసిన సీఎంఆర్‌ఎఫ్ ఆన్‌లైన్ విధానంలో ఏపీజీవీబీతో పాటు కొన్ని బ్యాంకుల ఐఎఫ్ఎస్ఐ కోడ్, కొన్నిమండలాల పేర్లు కనిపించటం లేదన్నారు. పల్లెటూర్లలో ఎక్కువమంది ఏపీజీవీజీ ఖాతాదారులు ఉంటారని, ఆన్‌లైన్‌లో ఆ బ్యాంక్‌పేరు కనిపించటం లేదన్నారు. అధికారులు సత్వరమే స్పందించి, సీఎంఆర్‌ఎఫ్ ఆన్‌లైన్ విధానాన్ని సవరించి, నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ అందేలా చర్యలు తీసుకోవాలని లింగనబోయిన సతీష్ కోరారు.

బదిలీ అయిన ఎస్జీటీలను వెంటనే రిలీవ్ చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై17: బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ జమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న పాఠశాలలో విద్యా వలంటీర్లను నియమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, విజయ్ అమృతకుమార్, కట్టా శేఖర్ తదితరలు పాల్గొన్నారు.

తులసీదాస్‌కు డాక్టరేట్



ఖమ్మంబైపాస్‌రోడ్, జూలై17: ఖమ్మం నగరంలోని శ్రీరాంనగర్‌కు చెందిన జేఎస్‌కే తులసీదాస్‌కు డాక్టరేట్ లభించింది. పోలీసుశాఖలో సూపరింటెండెంట్‌గా రిటైర్డు అయ్యారు. అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలలో అవగాహన, సామాజిక దృక్పథం, సామాజిక సేవాకోణాల్లో ప్రజలు చైతన్య పరుస్తున్నారు. తిరుమల,తిరుపతి దేవస్థానానికి ధర్మాచారిగా ఐదేళ్ల నుంచి పనిచేస్తున్నారు. పీస్ ఆఫ్ ఇండియా అనే సంస్థ ఈ డాక్టరేట్‌ను ఆయన ప్రకటించింది. బుధవారం ఆయన హైదరాబాదులో అవార్డును అందుకున్నారు.

వంద పడకల ఆసుపత్రి పనులు ప్రారంభించాలి

తిరుమలాయపాలెం, జూలై17: మండల కేంద్రానికి మంజూరైన వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రికి వంద పడకల ఆసుపత్రి పనులు ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. బుధవారం మండలంలని తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వంద పడకల ఆసుపత్రి మంజూరుచేశారని,ఇంతవరకు ఆసుపత్రిలో సరిపడా పరికాలు, వైద్య సిబ్బంది ని ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఈ సమావేశంలో కె.స్వామి, మద్దినేని శ్రీను, నవీన్, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే చిత్తడి

- అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితిలో రహదారులు
- విద్యార్థులకు, వయోవృద్ధులకు నరకయాతన
- ఒకటో డివిజన్‌లోని రైల్వేకాలనీ, విద్యానగర్, గణేష్‌నగర్‌ల్లో ప్రజలకు ఇక్కట్లు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై17: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఒకటో డివిజన్ పరిధిలోని పలు కాలనీల రహదారులు వర్షం కారణంగా చిత్తడిగా మారాయి. ఫలితంగా ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నాయి. ఆయా కాలనీలలో నేటికీ రహదారులకు నోచుకోని దుస్థితి నెలకొంది. ప్రస్తుతం డయేరియా, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ఈ రోడ్ల వెంట గుంతల్లో నీళ్ల ఆగి దోమలు, ఈగలు రోజురోజుకు అధికమై తీవ్ర ఇబ్బందులకు గురైతున్నామని పలువురు కాలనీ వాసులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లన్నీ బురదమయం కావడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డివిజన్ పరిధి అభివృద్ధిలో బాగంగా కొత్తకొత్త వెంచర్లలో నూతన గృహాల నిర్మాణం అధికంగా పెరగటంతో కార్పొరేషన్ అధికారులు కనీసం పట్టించుకున్న దఖాలాలు లేవని పలువురు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని రైల్వేకాలనీ, విద్యానగర్, గణేష్ నగర్, తదితర కాలనీలలో కనీస సౌకర్యాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన అన్ని అనుమతులు తీసుకొని, ఇంటి పన్నులు సకాలంలో కడుతున్నప్పటికి కార్పొరేషన్ అధికారులు కనీస అవసరాలైన రోడ్లు, వీదిలైట్లు సైడ్ డ్రైనేజ్, మిషన్ భగీరథలైన్లు వాటర్ లైన్ల నిర్మాణంలో ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారి చెబుతున్నారు. అధికారులకు, పార్టీల నాయకులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా ఒక్కరు పట్టించుకోవటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిత్తడి కారణంగా చిన్నారులు, వయోవృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. ఏటా వర్షాకాలంలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.





బురదమయంగా మారిన రైల్వేకాలనీ ప్రధాన రహదారి, రైల్వేకాలనీలో బురద రోడ్లపై విద్యార్థుల ఇబ్బందులు,